క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారికి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. రూ.1,500 రుసుం చెల్లించి సహస్ర తులసీదళార్చనలో, రూ.1,000 రుసుం చెల్లించి త్రికాల పంచామృతాభిషేక సేవలో భక్తులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సూర్యతేజ

దాబాగార్డెన్స్: స్నేహ సంధ్య ఏజీకేర్ ఫౌండేషన్ గురువారం పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ వద్ద ఉచిత బీపీ, సుగర్ వైద్య శిబిరం నిర్వహించింది. డాక్టర్ సూర్యతేజ పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుగర్, బీపీ ఉండేవారు తప్పనిసరిగా మందులతోపాటు ప్రతిరోజూ వాకింగ్ చేయాలని, రాత్రి వేళల్లో పుల్కా తినాలని సూచించారు. ప్రతి నెలా రెండో గురువారం ఉదయం 8 గంటల నుంచి స్వామి వివేకానంద సంస్థ వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని స్థానికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కొంత మంది పేషెంట్లకు వాకింగ్ స్టిక్స్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మహాలక్ష్మి తదితరులు

అల్లిపురం: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మనోరమా థియేటర్ ప్రాంతం నుంచి అచ్చియ్యమ్మపేట, యాతపేట, అంబేడ్కర్ కాలనీ, లక్ష్మీదేవిపేట, కొబ్బరితోట ప్రాంతాలలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పి.మహాలక్ష్మి, పారా మెడికల్ ఆఫీసర్ కె.వెంకటరమణ, డీపీఎంవో మహబూబ్ ఆలీ, పి.రామకృష్ణ, పారా మెడికల్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎంవీపీలో షణ్ముఖశర్మ ప్రవచనాలు

ఎంవీపీ కాలనీ: సామవేదం షణ్ముఖశర్మ హనుమద్వైభవ ప్రవచనాలు గురువారం ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా ప్రారంభమయ్యాయి. షణ్ముఖశర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు చేశారు. వేదాంగ జ్యోతిష్య నిపుణులు కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సర్కార్ బడులకు న్యూ లుక్

- 'నాడు–నేడు'తో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య

ఇది కదా అభివృద్ధి



ఆధునిక హంగులతో ప్రకాశరావుపేట పాఠశాల



మెరుగైన మౌలిక సదుపాయాలతో దండుబజార్ ఎంవీడీ పాఠశాల



క్రమశిక్షణతో జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు

దాబాగార్డెన్స్: నాడు అధ్వానంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు.. నేడు ఎంతో ఆకర్షణీయంగా మారాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక ఘోరంగా ఉండేవి. శిథిల భవనాల్లో పాఠశాలలు కొనసాగేవి. వర్షం పడితే తరగతి గదులన్నీ జలమయమయ్యేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు పెద్దపీట వేశారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయలు మంజూరు చేసి కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దారు. మెరుగైన బోధన, అన్ని సదుపాయాలతో దర్శనమిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. విద్యా రంగంలో విప్లవాత్మక చర్యలు చేపట్టడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కోట్లాది రూపాయలతో పాఠశాలల అభివృద్ధి

దక్షిణ నియోజకవర్గంలో ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలతోపాటు మరో ఎనిమిది జీవీఎంసీ స్కూళ్లు ఉన్నాయి. మన బడి నాడు–నేడు ఫేజ్–1లో ఈ పది పాఠశాలలను కోట్లాది రూపాయలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఫేజ్–2 విషయానికొస్తే రూ.3.29 కోట్లతో పలు పాఠశాలలను ఆధునికీకరించారు. రూ.24.98 లక్షలతో ప్రభుత్వ క్వీన్‌మేరీ ప్రాథమిక పాఠశాలను, రూ.57.61 లక్షలతో హైస్కూల్‌ను ఆధునికీకరించి మౌలిక సదుపాయాలు కల్పించారు. రూ.39.22 లక్షలతో ఎంజీఎం హైస్కూల్, రూ.31.42 లక్షలతో జీవీఎంసీ–ప్రకాశరావుపేట పాఠశాలను, రూ.22.26 లక్షలతో జీవీఎంసీ చెంగల్రావుపేట పాఠశాల, రూ.12.78 లక్షలతో అల్లిపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, రూ.20.38 లక్షలతో జీవీఎంసీ ప్రకాశరావుపేట ప్రాథమిక పాఠశాల, రూ.54.50 లక్షలతో ఎంవీడీ హైస్కూల్, రూ.41.36 లక్షలతో ఎంవీడీఎం ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించారు. రూ.25.29 లక్షలతో జీవీఎంసీ రమాదేవి భానోజీరావు అప్పర్ ప్రైమరీ పాఠశాలను ఆధునికీకరించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. వైఎస్ జగన్ సర్కారు చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అత్యాధునికంగా ప్రకాశరావుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల

'నాడు–నేడు'తో సకల సదుపాయాలు



నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రస్తుతం 560 మందికి పాఠాలు చెబుతున్నాం. పాఠశాలల అభివృద్ధి, విద్యకు ఇస్తున్న ప్రాధాన్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హ్యాట్సాఫ్.

– శ్రీనివాసరావు, హెచ్‌ఎం, ప్రకాశరావుపేట జీవీఎంసీ హైస్కూల్

అభివృద్ధి చర్యలు అమోఘం



రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడులకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి అమోఘం. పాఠశాలలకు మంచి లుక్ వచ్చింది. మా పాఠశాలలో గతంలో 330 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 675కు చేరింది. నాడు–నేడు కింద మా పాఠశాలను ఆధునికంగా తీర్చిదిద్దారు.

– బుద్దా జగన్నాథరావు, హెచ్‌ఎం, జీవీఎంసీ ఎంవీడీ హైస్కూల్

'యాత్ర–2'చిత్రానికి బ్రహ్మరథం

- జై జగన్ నినాదాలతో హోరెత్తిన గోకుల్ థియేటర్
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానుల సందడి
- 600 మందికి ఎమ్మెల్యే వాసుపల్లి ఉచిత టికెట్లు



గోకుల్ థియేటర్ వద్ద అభిమానులు, పార్టీ కార్యకర్తల సందడి



యాత్ర–2 సినిమాను వీక్షించేందుకు వచ్చిన కార్పొరేటర్ తోట పద్మావతి, కొల్లి సింహాచలం తదితరులు



తీన్‌మార్‌తో సినిమా చూసేందుకు తరలివెళ్తున్న పిల్లి సంతోష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: యాత్ర సినిమాకు సీక్వెల్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యదార్థ గాథగా తెరకెక్కించిన యాత్ర–2 సినిమాకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా థియేటర్లలో రిలీజైన ఈ సినిమాను నియోజకవర్గంలోని గోకుల్ థియేటర్‌లో ప్రదర్శించారు. సుమారు 600 మందికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉచితంగా యాత్ర–2 సినిమా టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు జై జగన్.. జై వాసుపల్లి అంటూ నినాదాలు చేశారు. దీంతో థియేటర్ ప్రాంగణమంతా జై జగన్ నినాదాలతో హోరెత్తింది. చిత్రం చూసిన అనంతరం వారు మాట్లాడుతూ చిత్రంలో సన్నివేశాలను జగనన్న జీవితంలో జరిగిన యదార్థ ఘటనలు కళ్లకు కట్టినట్లు దర్శకుడు తెరకెక్కించారన్నారు. ప్రజల మనిషిగా తండ్రి మించిన తనయుడిగా చిరస్థాయిగా జగనన్న అభిమానులు, ప్రజల గుండెల్లో ఉండిపోతారన్నారు. అదే రీతిలో పార్టీ కార్యకర్తలను తన కుటుంబ సభ్యులుగా చూస్తూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 2024 ఎన్నికల్లో విజయం సాధించి జగనన్నకు బహుమతిగా ఇస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో 175కు 175 సీట్లు గ్యారంటీగా గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, వార్డు ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అల్లిపురంలో పండగ వాతావరణం

యాత్ర–2 చిత్రం విడుదల సందర్భంగా అల్లిపురంలో పండగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ సింగపూర్ ఎన్‌ఆర్‌ఐ కన్వీనర్ పిల్లి సంతోష్‌రెడ్డి, 33వ వార్డు నాయకుడు, టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, వార్డు మాజీ మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు, వార్డు నాయకులు నీలాపు అయ్యప్పరెడ్డి, ప్రసాదరెడ్డి, సంజీవరెడ్డి, నవీన్‌రెడ్డి, గంగుల మానస, గుణ, వై.రూప్సీ, హేమలత, తరుణ్‌లు తీన్‌మార్ వాయిద్యాలతో సినిమా చూసేందుకే బయలుదేరారు. దారి పొడవునా జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ థియేటర్‌కు తరలివెళ్లారు.

నేడు యువశక్తి సదస్సు



మాట్లాడుతున్న పల్సస్ సీఈవో గేదేల శ్రీనుబాబు

సీతమ్మధార: ఈ నెల 9న విశాఖ గురజాడ కళాక్షేత్రంలో యువశక్తి సదస్సు నిర్వహించనున్నట్లు పల్సస్ సీఈవో గేదేల శ్రీనుబాబు తెలిపారు. ఆశీలమెట్టలోని ఒక హోటల్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు 10 వేల మంది హాజరు కానున్నారని, దీనిని జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతులు తమ పంటను తామే మార్కెటింగ్ చేసుకునేందుకు, విద్యార్థులు తమ కాళ్లపై తామే నిలబడేందుకు అనుసరిస్తున్న విధానాలపై సదస్సులో నిపుణులు వివరిస్తారని చెప్పారు. వివిధ రంగాల పరిశ్రమలను ఆకర్షించడం, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడం ద్వారా అద్భుత ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. డిజిటల్ విప్లవం కోసం నేటి యువతను సిద్ధం చేయడం ద్వారా రాష్ట్ర ప్రగతి, ఆర్థిక శక్తిగా లక్ష్యాలను చేరుకునేందుకు మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి 2 కోట్ల మందికి చేరువవుతామని చెప్పారు. నేటి విద్యార్థులే రేపటి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. నగరంలో 2.25 లక్షల మంది ఉద్యోగులుంటే, మరో 8 లక్షల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని, భవిష్యత్తులో వారందరికీ ఉపాధి కల్పించే దిశగా యోచిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం



1,045వ రోజు దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా రక్షించుకోవాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపడుతున్న నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,045వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ మతం జపం చేసే ప్రధాని మోదీ 90 శాతం మంది హిందువులు ఉద్యోగులుగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం వారికి ద్రోహం చేసినట్టు కాదా.! అని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తన తప్పిదాలను పక్కదారి పట్టించడానికి హిందూ మతాన్ని అడ్డం పెట్టుకొని అంబానీ, ఆదాని, జిందాల్ వంటి పారిశ్రామిక వేత్తలకు దేశాన్ని తాకట్టుపెట్టడం బాధాకరమన్నారు. దీక్షా శిబిరంలో పి.అనిల్‌కుమార్, అశోక్ స్వామి పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



బ్యానర్ ప్రదర్శిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు

కంచరపాలెం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, నెహ్రూ యువ కేంద్రం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి ఏడీసీపీ(ట్రాఫిక్) జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భద్రతా నియమాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాణిక్య కుమారి, డాక్టర్ షైజీ, అధికారులు ఎన్.నాగేశ్వరరావు, బాలరాజు, ఎం.ప్రసన్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సినిమా దినోత్సవం



మాట్లాడుతున్న నరవ ప్రకాశ రావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు సినిమా దినోత్సవం గురువారంతో విజయవంతంగా ముగిసింది. హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వంలో భక్తప్రహ్లాద సినిమా విడుదలై సంచలనం సృష్టించిన సందర్భంగా ఈ ఉత్సవాలను ఏర్పాటు చేశారు. పౌర గ్రంథాలయం హాల్‌లో బంగారు పాప, జయభేరి, బలగం సినిమాలను ప్రదర్శించారు. ముగింపు సమావేశంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా చిత్రోత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉత్సవాలు టూరిజం ఆదాయ వనరులుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్‌ఏడీ పాల్, ఉపాధ్యక్షులు కాశీవిశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, హుస్సేన్ చాట్ల బాబూరావు రెడ్డి, ఉషారాణి, డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పేర్లు నమోదు చేసుకుంటున్న స్థానికులు

అల్లిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా గురువారం జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట–1 సచివాలయం పరిధిలోని ప్రజలకు కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి పి.మహాలక్ష్మి, సిబ్బంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. సుమారు 527 మంది వైద్య సేవలు పొందారు. మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోతన్న దహన సంస్కారాలకు రూ.10 వేల సాయం



డీఆర్వో మోహన్‌కుమార్‌తో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మహారాణిపేట: మృతి చెందిన రిమాండ్ ముద్దాయి కోడా పోతన్న దహన సంస్కారాలకు జిల్లా యంత్రాంగం రూ.10 వేల ఆర్థిక సాయం చేసింది. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ గురువారం అతని భార్యకు ఈ మొత్తం చెక్కును అందజేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, బీఎస్పీ నాయకుడు బోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న ఈస్ట్ క్రైం సీఐ ఆదాం

సీతమ్మధార: ప్రజలందరి సహకారంతోనే నేరాలను నియంత్రించవచ్చని ఈస్ట్ క్రైం సీఐ ఆదాం అన్నారు. ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌కు సంబంధించి అబిద్‌నగర్ షాదిఖానా ఫంక్షన్ హాల్‌లో గురువారం నేర నియంత్రణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అపార్ట్‌మెంట్, గ్రూప్ హౌస్, ఇళ్లకు రక్షణ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమన్నారు. నగరంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలని కోరారు. ఊళ్లు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని, విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లు, స్నేహితుల ఇళ్లలో భద్రంగా పెట్టుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి పూట తమ వాహనాలకు నాణ్యమైన లాక్ వేసుకోవాలన్నారు. నైట్ బీట్ కానిస్టేబుళ్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ భాస్కరరావు, టూ టౌన్ ఎస్ఐ డి.అప్పారావు, మహారాణిపేట ఎస్ఐ ఎ.సత్యారావు, ప్రెసిడెంట్ ఎం.డి.అబీబ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మాఘ మాసోత్సవాలు

అల్లిపురం: వెంకటేశ్వర మెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో ఈ నెల 10 నుంచి మాఘ మాసోత్సవాలు ప్రారంభమవుతాయని అక్కడి అలిమేలు మంగమ్మ అమ్మవారి దేవాలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు మాఘ స్నానాలు ఆచరిస్తారన్నారు. ఈ నెల 11, 18, 25, మార్చి 3, 10 తేదీల్లో ఐదు మాఘపు ఆదివారాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నెల 16న రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయన్నారు. 20న భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. సాయంత్రం శ్రీ భూసమేత శ్రీనివాస కల్యాణం ఉంటుందన్నారు. మాఘ పౌర్ణమి 24న ప్రత్యేక సముద్ర స్నానాలు చేస్తారన్నారు. అదే రోజు సాయంత్రం శ్రీ భూ సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 10వ తేదీ తెల్లవారు జామున 5 గంటల నుంచి ఛాయా ఉషాదేవి సమేత సూర్యనారాయణస్వామికి విశేష పంచామృతాభిషేకాలు చేపట్టి.. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు. 5వ ఆదివారం, అమావాస్య సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని తెలిపారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

అల్లిపురం: లాడ్జిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మల్‌హత్ బాలాజీ నాయక్ (28) ఈ నెల 5వ తేదీన పందిమెట్ట దరి ఒక లాడ్జిలో దిగాడు. ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చానని లాడ్జి సిబ్బందికి తెలిపాడు. గురువారం ఉదయం 10 గంటలకు హోటల్ గది చెక్ అవుట్ చేయాల్సి ఉంది. ఎంతకీ అతను గది నుంచి బయటకు రాకపోవటంతో లాడ్జి సిబ్బంది తలుపు కొట్టినా లోపల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. దీంతో వారు మహారాణిపేట పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మరో తాళం చెవితో తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో మృతదేహాన్ని దించి కేజీహెచ్ మార్చురీకి తరలించారు. గదిలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు తెలిపారు. లాడ్జి యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.